క్లుప్తంగా

మొక్కల రాజశేఖర్‌కు అభినందన



రాజశేఖర్‌ను అభినందిస్తున్న దిండిగల

కొత్తగూడెంఅర్బన్: ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట మొక్కలు నాటుతున్న సింగరేణి ఉద్యోగి, ప్రకృతి సేవకుడు రాజశేఖర్‌ను, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ అభినందించారు. బుధవారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజేందర్ మాట్లాడుతూ.. ప్రకృతి హరిత దీక్ష అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రతీరోజు క్రమం తప్పకుండా మొక్కలు నాటుతూ నేటికి 1100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రంథాలయం ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో మూడ్ జయరామ్‌నాయక్, విశ్వామిత్ర చౌహాన్, షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెల 1న పెన్షన్ ఇవ్వండి

పాల్వంచరూరల్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను, అన్ని బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు బుధవారం కలెక్టరేట్‌లోని డీటీఓ దుర్గాంబకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు ప్రతినెల సక్రమంగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. హెల్త్ స్కీమ్‌లో రూ.2లక్షల గరిష్ట పరిమితిని ఎత్తివేయాలని, ఈపీఎస్ పెన్షనర్లకు అసరా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఎస్ నారాయణ, చల్లగుల్ల నాగేశ్వరరావు, బంధు కోటేశ్వరరావు, డి.కృష్ణమూర్తి, జానకిరామ్, జోగయ్య, గోవిందరావు, శ్రీహరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇవ్వండి



కాంగ్రెస్ రాష్ట్ర నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో ఓబీసీ (బీసీ)ల జనాభా శాతం సగటు 50శాతానికి పైమాటే, కొన్ని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో అయితే 60శాతం నుంచి 75 శాతం వరకు బీసీ ఓటర్లు ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్య విషయానికి వచ్చినపుడు బీసీల వాటా 15శాతం మించడం లేదని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ సభ్యుడు నాగాసీతారాములు, ఓబీసీ నాయకులు.. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులను కలిసి వినతులు అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 88 జనరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం 7–8 నియోజకవర్గాల్లో అధిక శాతం ముస్లిం ఓటర్లు ఉంటారని, మిగతా 80 నియోజకవర్గాల్లో 55శాతం నుంచి 75 శాతం వరకు ఓబీసీ ఓటర్లే ఉన్నారని వివరించారు. తెలంగాణలో బీసీలకు పెద్దపీట వేయాలని, రాష్ట్రంలో బీసీల శాతం మేరకు ఓబీసీల గెలుపు అనుకూలంగా ఉన్న అత్యధిక నియోజవర్గాల్లో పోటీకి అవకాశం కల్పించాలని, అన్ని స్థాయిల కాంగ్రెస్ సభ్యులు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీసీ నాయకులు, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, మాజీ టీపీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, మాజీ పార్లమెంటు సభ్యులు పొన్నం ప్రభాకర్‌లను కలిసి వినతులు అందజేసినట్లు వివరించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



రథయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణలో కూడా సీపీఎస్‌ను రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో డీపీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కలెక్టరేట్ ఏఓ గన్యా, టీజీఓ జిల్లా అధ్యక్షుడు సంగెం వెంకటపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్ చేతుల మీదుగా పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1.72 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల చిరకాల కోరిక అయిన పాతపెన్షన్‌ను రాబోయే సాధారణ ఎన్నికలలోపు పునరుద్ధరించి, సీపీఎస్‌ను రద్దుకు డిమాండ్ చేస్తూ 33 జిల్లాల మీదుగా ఈనెల16 నుంచి 15 రోజులు చేస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సలికినేని రాజశేఖర్, నాగు నాయక్, బట్టు శ్రీనివాస్, రామకృష్ణ, ప్రభాకర్, సతీష్, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్చి సాగుపై రైతుల ఆసక్తి

- రికార్డు స్థాయిలో పెరగనున్న సాగు విస్తీర్ణం
- ముమ్మరంగా నారుమడులు తయారీ





అనంతారంలో విత్తనాలు విత్తుతున్న కూలీలు (ఇన్‌సెట్) మొద్దులగూడెంలో మిరపనారు మడులు

జూలూరుపాడు: ఈ వానాకాలంలో మిర్చి పంట సాగు రికార్డు స్థాయిలో పెరగనుంది. గత ఏడాదిలో 6,053 ఎకరాల్లో సాగైన మిర్చి పంట ఈ ఏడాది సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. జూలూరుపాడు మండలంలోని రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా మడుల్లో మిరప విత్తనాలు విత్తి చీరలు కప్పి రక్షణ కల్పిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా మిరప నారు మడులే కనిపిస్తున్నాయి. గత ఏడాది మిర్చి పంటకు వైరస్ సోకి దిగుబడి గణనీయంగా తగ్గింది. కానీ మార్కెట్‌లో అధిక ధర పలకడంతో లాభాలు వచ్చాయి. దీంతో పత్తి సాగు కంటే మిర్చి పంటే మేలు అని, కాలం కలిసి రాకపోతుందా? అనే ఆశతో కౌలు ధరలు కూడా పెరగడంతో మిర్చి పంట అయితేనే బాగుంటుందని కౌలు రైతులతో సహా మిర్చి సాగుకే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు నకిలీ విత్తనాల బెడద, పంటకు తెగుళ్లు, అధిక వర్షాలు, మార్కెట్‌లో ధర గురించి కూడా ఆలోచిస్తున్నారు. అయినా కోటి ఆశలతో రైతన్నలు మిర్చి సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

పెట్టుబడి రావాలంటే తప్పదు



కౌలు, పెట్టుబడి రావాలంటే మిరప పంట సాగు చేయాల్సిందే. ఈ ఏడాది ఒక ఎకరం కౌలు ధర రూ 50 వేలు కాగా, గత ఏడాది రూ.40 వేలు.. సొంత భూమి 10 ఎకరాలు ఉంది. మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. 15 ఎకరాలు మిర్చి, 5 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాం. మిరప విత్తనాలు చల్లినం. గతేడాది మిర్చికి మంచి ధర వచ్చింది.

– బండారు పుల్లారావు, కౌలు రైతు, అనంతారం

ప్రత్యామ్నాయం లేదు



గత్యంతరం లేకనే మిర్చి పంట సాగు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది 20 ఎకరాలు రూ.10 లక్షలు కౌలు చెల్లించి తీసుకున్నాను. సొంత భూమి 8 ఎకరాలు ఉంది. 20 ఎకరాల్లో మిర్చి, 6 ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో వరి సాగు చేయాలి. గతేడాది మిర్చి పంటకు మంచి ధర లభించడంతో లాభం వచ్చింది. మిర్చి సాగుకు దుక్కి సిద్ధం చేసినం.

– బంటు వెంకటేశ్వర్లు, అనంతారం కౌలు రైతు

మిర్చి సాగు మేలు



పత్తి పంట కంటే మిర్చి పంట సాగు మేలు. గతేడాది మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి ధర లభించింది. క్వింటాల్ ధర రూ.17 వేలు, రూ.22 వేలు చొప్పు అమ్మినం. ఈ ఏడాది కూడా 8 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నాం. మిరప విత్తనాలు రూ.1.53 లక్షలు అయ్యాయి. మిరప నారు పెరిగిన తరువాత తోట వేసేందుకు దుక్కి సిద్ధం చేశాం.

– ఈసం లింగయ్య, రైతు అనంతారం

కిషన్‌రెడ్డి, ఈటల నియామకంపై హర్షం



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి, ఎలక్షన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్ నియామకం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణతో పాటు పలువురు జిల్లా నాయకులు హర్షం, వ్యక్తం చేశారు. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కోనేరు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయినట్లు చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ కార్యకర్తల్లో జోష్ తీసుకొచ్చి పార్టీని నడిపించారని కొనియాడారు. తెలంగాణలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎర్రంరాజు, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, నల్లా సోమసుందర్, ఏనుగుల వెంకటరెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు గోపీకృష్ణ, నరేంద్రబాబు, శ్రీనివాసరావు, భిక్షపతి, భూక్యా ప్రసాద్, లక్ష్మణ్ అగర్వాల్, పిల్లి రాజేశ్వరరావు, జోగు ప్రదీప్, పైడిపాటి రవీందర్, రాయుడు నాగేశ్వరరావు, గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

‘ఉపా’ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాగన్న

ఇల్లెందు: ప్రశ్నించే గొంతులను నిర్బంధించేందుకు తెచ్చిన ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని అరుణోదయ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరకాల నాగన్న, దాసు కోరారు. బుధవారం ఇల్లెందులో అరుణోదయ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ... మేధావులు, హక్కుల ప్రజా సంఘాల నేతలపై ఉపా కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టుల మీద బెదిరింపులు, దాడులు పెరిగాయన్నారు. జర్నలిస్టు తులిపి చందుపై మతోన్మాదులు ఫాసిస్టులు బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. అర్హులందరికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, 4.50 లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కళాకారులకు నెలకు రూ.5 వేల పింఛన్ అందజేయాలని కోరారు. సమావేశంలో ఉదయగిరి, అబ్దుల్, సైదులు, చిరంజీవి, బొగ్గారపు వెంకన్న, శ్రీకాంత్, కిషన్ నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

టేకులపల్లి: వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ గొల్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సులానగర్ పీహెచ్‌సీలో జరిగిన ఆశా కార్యకర్తలకు, వైద్య రివ్యూ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. 2025 కల్లా క్షయ వ్యాధిని అంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనుమానిత రోగులను గుర్తించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి పరీక్షల నిమిత్తం పంపించాలని ఆదేశించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతీఒక్కరి బాధ్యత అని, ఈ దిశగా ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రివ్యూ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ గన్యా, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, శంకర్, సూపర్‌వైజర్లు నాగుబండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జా విజయ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల కోసం సమష్టిగా ఉద్యమిద్దాం..



కొమరారంలో సమావేశమైన గిరిజనేతరులు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ గ్రామాలలో గిరిజన చట్టాల వల్ల కనీసం జీవించే హక్కును కూడా కోల్పోవాల్సి వస్తోందని, ఈ సమస్యను అధిగమించేందుకు దశల వారీ ఉద్యమాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏజెన్సీ గిరిజనేతరులు నిర్ణయించారు. కొమరారం రెవెన్యూ పరిధిలోని గ్రామపంచాయతీల నుంచి సుమారు 200 మంది గిరిజనేతరులు డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం సమావేశమయ్యారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులలో దేశంలో జన్మించిన ప్రతి పౌరుడు ఎక్కడైనా నివసించే హక్కు కల్పించిందని, కానీ ఏజెన్సీలోని 5వ షెడ్యూల్డ్, 1/70 చట్టాల వల్ల దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించివేయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి గిరిజనుల హక్కులకు భంగం కలగకుండా చట్టాలను సవరించి, గిరిజనేతరులకు భూములు, ఇళ్లు, ఇతర ఆర్థిక వనరులపై హక్కు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఏజెన్సీలో గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు దశలవారీ ఉద్యమాలు నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. దీనికోసం ఈ నెల 10వ తేదీన కొమరారం కేంద్రంగా భారీ ప్రదర్శన నిర్వహించడంతోపాటు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. 18 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో మంచె రమేష్, పోలబోయిన నాగేశ్వరరావు, మోడెం వెంకన్న, శ్రీరాంకోటయ్య, జూకంటి గాంధీ, సీతాఫల ఛార్లీ, గుడిపల్లి సుధాకర్, పెద్ద చారీ, తుడుం బాబు, బుర్ర రాఘవులు, కోడి పాపారావు, బుర్రి ప్రవీణ్, దాసరి కోటయ్య, డాక్టర్ అన్వర్, కోడి శ్రీరాములు, బండారి సత్యం, చెన్నూరి శ్రీనివాస్, వర్రె లింగన్న, కోడి మల్లయ్య, చందా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు పోడుపట్టాల పంపిణీ

పాల్వంచరూరల్: ఈనెల 7న ఉదయం స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ బి.నారాయణ కార్యదర్శులు పాల్గొన్నారు.

9న ఉమ్మడి జిల్లా విద్యా సదస్సు

టేకులపల్లి: ఈనెల 9న ఐటీడీఏ భద్రాచలంలో జరిగే గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల ఉమ్మడి జిల్లా విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం, గంగారం ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. జూలై 1 నుంచి పీఆర్సీని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



టేకులపల్లి: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా కమిటీలో టేకులపల్లికి చెందిన యువకుడికి అవకాశం లభించింది. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య మాట్లాడుతూ.. టేకులపల్లి మండలం వెంకట్యాతండాకు చెందిన ఆంగోతు వెంకటేష్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసినట్లు చెప్పారు.

విప్‌ను కలిసిన గెస్ట్ లెక్చరర్లు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ విప్ రేగా కాంతారావును కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల గెస్ట్ లెక్చరర్లు బుధవారం మణుగూరులో కలిశారు. మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా తాము పనిచేస్తుండగా.. అధికారులు కొత్తవారి నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. తిరిగి తమనే కొనసాగించేలా చూడాలని కోరారు. దీంతో స్పందించి విప్ సింగరేణి డైరెక్టర్ బలరామ్‌కు ఫోన్ చేసి చర్చించగా ఆయన పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

పాల్వంచ: జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలో బుధవారం నెహ్రూనగర్, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీలలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పోడు పట్టాలకు డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు

టేకులపల్లి: పోడు పట్టాలకు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు అన్నారు. ఈ మేరకు సాక్షిలో బుధవారం ప్రచురితమైన ‘పోడు పట్టాల పంపిణీలో చేతివాటం’ ప్రత్యేక వార్తా కథనం నేపథ్యంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పోడు భూమి పట్టాలను పంపిణీ చేస్తోందని అర్హులైన గిరిజనులకు ఉచితంగానే అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.

పోడు సమస్యకు పరిష్కారం చూపాం..



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: పోడు సమస్యకు పరిష్కారం చూపి ఎన్నికల వాగ్దానాన్ని నేరవేర్చామని, పట్టాల పంపిణీతో గిరిజనుల కల సాకారం అయిందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, స్టేషన్ బేతంపూడి, జామ్లా తండా, సింగభూపాలెం, గరీబ్‌పేట గ్రామాల్లోని 978 మంది రైతు కుటుంబాలకు 2286.35 ఎకరాలకు పోడు పట్టాలను ప్రజా ప్రతినిధులతో కలసి సుజాతనగర్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు పోడు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని, సీఎం కేసీఆర్ కృషితో గిరిజనుల కల నెరవేరిందన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, గత పాలకులు పోడు భూముల సమస్యలను పట్టించుకోలేదన్నారు. పోడు పట్టాలతో గిరిజనుల కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. పోడు రైతులకు రైతుబంధుతో పాటు, రైతు బీమా కూడా వర్తిస్తుందన్నారు. పట్టాలు రాని రైతులు అధైర్య పడవద్దని, రెండో దఫాలో వస్తాయని తెలిపారు. ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఎంపీటీసీలు బత్తుల మానస, పెద్దమళ్ల శోభారాణి, మూడు గణేష్, నాయకులు రెడ్డెం తులసిరెడ్డి, పెద్దమళ్ల నరేందర్, గాజుల సీతారామయ్య, అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ అవకాశం నా అదృష్టం



పోడు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: ఎంతోమంది ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు అయ్యారు, వెళ్లారు. కేసీఆర్ హయాంలోనే పోడు పట్టాలు మంజూరు చేయడం, ఆ పట్టాలు నా చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేసే అవకాశం నాకు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. బుధవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పోడు భూమి పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాట్లాడుతూ.. గతంలో పోడు భూముల్లోకి ఫారెస్టు అధికారులు వచ్చి ఇబ్బంది పెట్టేవారు, బోర్లు వేసుకోవాలన్నా, విద్యుత్ సౌకర్యం తీసుకోవాలన్నా చాలా కష్టం ఉండేది ఆ కష్టాలన్నీ దూరం చేస్తూ పోడు భూమిపై శాశ్వత హక్కుని కల్పిస్తూ పట్టా ఇవ్వడం జరిగిందని, ఇకపై ఏ ఫారెస్టు అధికారి భూమిల్లోకి రారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే అటవీ హక్కుల చట్టం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): పదవులను నిరాకరించి అటవీ హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టాలను సాధించిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పోడు సాగుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టులు పోడు భూముల పట్టాల కోసం పోరాడుతుండగా నేడు ఫలితం లభించిందని చెప్పారు. ఈ సమయంలో ఎన్నో నిర్బంధాలు, కేసులను ఎదుర్కొన్నామన్నారు. అయితే, అర్హులందరికీ పట్టాలు ఇవ్వకపోతే తమ పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు, రైతులు జి.సత్యనారాయణ, కాటూరి రాము, ఈసం కన్నయ్య, కుంజా రాందాసు, పెద్ద నారాయణ ,పర్సా పట్టాభి, బొమ్మల సురేష్, గొగ్గెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



ఇల్లెందురూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రామపంచాయతీ వర్కర్లు

టేకులపల్లి: గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ల టేకులపల్లి మండల నూతన జేఏసీని నియమించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నాయకులు నూతన జేఏసీ పేర్లను ప్రకటించారు. గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 6 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే టేకులపల్లిలో నూతన జేఏసీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మండల చైర్మన్గా మూడు బిచ్చు, జేఏసీ కన్వీనర్గా సరికొండ నాగేశ్వరరావు, కోకన్వీనర్‌గా ఈసం మహేష్, బాదావత్ వీరన్న, సభ్యులను ఎన్నుకున్నారు. అశోక్, వెంకటాచారి పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు గురువారం నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేద్దామని కార్మిక సంఘాల జిల్లా జేఏసీ కోకన్వీనర్ జటంగి వెంకన్న పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం సమ్మె ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 17 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామని గుర్తుచేశారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, తోడేటి నాగేశ్వరరావు, సామేలు, మోహన్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

విద్యారంగం వెనకబడిపోతోంది..



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తోంది.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాం అందలేదని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాందావత్ రమేష్‌బాబు, దాసరి గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇల్లెందు ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. పై తరగతులకు వెళ్లిన విద్యార్థుల నుంచి సేకరించిన పాఠ్యపుస్తకాలను అందజేసి వాటి ద్వారా బోధన జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థికీ రెండు జతల యూనిఫాం ఇవ్వాల్సి ఉండగా.. ఒక్క జత మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మండలంలోని పలు పాఠశాలల భవనాలు వర్షానికి కురుస్తున్నాయని తెలిపారు. చాలా పాఠశాలల్లో కనీసం ఉపాధ్యాయులు కూడా లేరన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ పట్టణ నాయకులు వి.వినీత్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నాసిరకంగా డ్రెయినేజీల నిర్మాణం



జూలూరుపాడు మండల కేంద్రంలో తల్లాడ - భద్రాచలం రాష్ట్రీయ రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ నాణ్యతా లోపంగా నిర్మించారు. రహదారికి సైడుకాలువల నిర్మాణం, డివైడర్‌ను గ్రిల్స్‌తో ఆధునీకరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) రూ.5.22 కోట్ల నిధులతో ఈ పనులు చేపట్టారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సుమారు 200 మీటర్ల మేర డ్రెయినేజీల వాల్స్ విరిగిపడ్డాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపాన్ని వెక్కిరిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : లఖన్ నాయక్,
ఆర్అండ్‌బీ జేఈఈ, జూలూరుపాడు
సెల్ నంబర్: 9866309579